సాక్షి
వనపర్తి
ఆదివారం । 16 । జూన్ । 2024



సాగునీరు అందిస్తాం

కేఐఎల్ఐ చివరి ఆయకట్టుకు సాగునీరంది స్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸



మార్మోగిన బీచుపల్లి

బీచుపల్లి పుణ్యక్షేత్రం శనివారం ఆంజనేయ స్వామి నామస్మరణతో మార్మోగింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.2 /23.4

రోజంతా వాతావరణ సాధారణంగా ఉంటుంది. అప్పడప్పుడు ఆకాశం మేఘావృతమై చల్లబడుతుంది.

ఎంతో నేర్చుకున్నా..



తండ్రి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

'చిన్నప్పటి నుంచి అన్నింట్లో మా నాన్నే నాకు ఆదర్శం. ఆయన నుంచే ప్రతి విషయం నేర్చుకున్నా. రాజకీయాల్లో ఆయన సుదీర్ఘ అనుభవం నాకెన్నో పాఠాలు నేర్పించింది. ఎన్నికల్లో ఓడినా.. గెలిచినా.. ఆత్మస్థైర్యం కోల్పోని వ్యక్తిత్వం, ఎప్పటికీ ప్రజలతోనే మమేకం అయ్యే ఆయన తీరు నాకు స్ఫూర్తి. నా తండ్రిలా ఎప్పటికీ ప్రజల్లో ఉండేందుకు, వారి సంక్షేమం కోసం పని చేస్తాను. అందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు.

– కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

స్ఫూర్తిని కొనసాగిస్తా..



మాజీ ఎంపీ రాములుతో భరత్‌ప్రసాద్

నా జీవితంలో మొదటి నుంచి అన్ని విషయాల్లో మా నాన్నే నా గురువు. ఎప్పుడూ నా వెన్నంటే ఉండి నాకు ధైర్యం చెప్పే స్నేహితుడు కూడా నాన్నే. రాజకీయ రంగంలో ఆయన సుదీర్ఘ అనుభవం, క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన చూపించే సంయమనం, ధైర్యం నాకు ఆదర్శం. ఆయన దారిలోనే ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చాను. గెలుపు, ఓటములతో నిమిత్తం లేకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ, నాన్న స్ఫూర్తిని ఎప్పటికీ కొనసాగిస్తాను. తమ సంతానం ఉన్నతి కోసం బాధ్యతగా వ్యవహరిస్తున్న నాన్నలందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు.

– పోతుగంటి భరత్‌ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు, కల్వకుర్తి



సూపర్ నాన్న

- నేటితరం తండ్రుల్లో పెరిగిన స్నేహశీలత
- ఆధునిక ప్రపంచానికి అనుగుణంగా మారుతున్న పాత్ర
- ఒకప్పటి భయం.. ఇప్పుడు స్నేహంగా రూపాంతరం
- అమ్మకు ధీటుగా.. పిల్లలకు చేరువగా

నేడు ప్రపంచ తండ్రుల దినోత్సవం

అమ్మా.. అనే పిలుపుతో ఎవరినైనా పిలుస్తాం.. కానీ, నాన్న అనే పిలుపు ఒక్క కన్నతండ్రికే సొంతం.. చేయి పట్టుకొని నడిపించే మార్గదర్శకుడు. ఆపదలో అభయప్రదాత.. పిల్లలకు ఏం కావాలో తెలుసుకొని.. భవిష్యత్‌లో వాళ్లేం కావాలో దిశానిర్దేశం చేస్తాడు.. బిడ్డల ఎదుగుదలను చూసి.. తనలో తానే మురిసిపోతాడు.. పిల్లలు ఉన్నత స్థానాలకు ఎదిగితే నలుగురికి చెప్పుకొని గర్వపడతాడు.. ప్రపంచమంతా నీకు వ్యతిరేకంగా ఉన్నా.. వెన్నంటి నిలిచేవాడే నాన్న.. ఓటమిపాలై కుంగిపోతున్నప్పుడు నేనున్నా.. అని వెన్ను తట్టి ధైర్యం చెప్పేవాడు నాన్న. లోపాలను సరిచేస్తూ.. మన భవిష్యత్‌కు పునాదులు వేస్తూ నిరంతరం శ్రమించే శ్రామికుడు నాన్న.. ఓ వైపు ఉన్నత గమ్యం చూపుతూ.. మరోవైపు అనురాగానికి అర్థం చెబుతాడు. అలా తండ్రి చేయి పట్టుకొని ఉన్నత గమ్యం వైపు నడిచిన వారు కోకొల్లలు.. ఆదివారం 'ప్రపంచ తండ్రుల దినోత్సవం' సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..

– పాలమూరు

తండ్రులు వారి పిల్లల అభివృద్ధిలో ఆశ్చర్యకరంగా ఒక పెద్ద పాత్రను పోషిస్తున్నారు. ఈనాటి తండ్రి అంటే ఓ స్నేహితుడు.. ఓ తత్వవేత్త.. ఓ విమర్శకుడు.. ఇలా అన్నీ తానై.. ముందుకు నడిపిస్తున్నాడు. ఒక కొత్త అధ్యయనంలో పిల్లల చిన్నతనంలో భాష, సాంఘిక నైపుణ్యాల అభివృద్ధిలో తండ్రి కీలకమైన పాత్రను పోషిస్తున్నారని తెలిసింది. నాన్న మారిపోయాడు.. ఔను, ఆధునిక సమాజంలో మార్పులకు అనుగుణంగా.. కుటుంబానికి తగ్గట్టుగా.. ఆ మాటకొస్తే పిల్లలకు నచ్చినట్లుగా ఒదిగాడు. చిన్న పిల్లలకు గురువుగా.. వారి వయసు పెరిగేకొద్దీ స్నేహితుడిగా.. వారికి పెళ్లయ్యాక మార్గదర్శిగా మారిపోయాడు. కుటుంబం కోసం తనను తాను మార్చుకున్నాడు. తన కలల రూపాలైన పిల్లల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నాడు. ఉద్యోగం, కష్టాలు, అసౌకర్యాలు, అనర్థాలు ఎన్ని ఎదురైనా ఎదురుగా పిల్లలు కనిపిస్తే తానూ చిన్న పిల్లాడిలా మారిపోవడం నేర్చుకున్నాడు. పిల్లలు ఒంటరితనంతో బాధపడుతున్నప్పుడు.. పరిష్కారం దొరకక సమస్యల్లో సతమతమవుతున్నప్పుడు.. ఓ జవాబుగా మారిపోతున్నాడు. ఒకప్పటి గాంభీర్యాన్ని మమకారంగా మార్చి కరిగిపోవడం నేర్చుకున్నాడు. పిల్లల మనసులో ఏముందో కనుక్కోవడానికి తన మనసు విప్పే విద్యను అవపోసన పట్టేశాడు. అందుకే అమ్మకు ధీటుగా.. నాన్న కూడా పిల్లలకు దగ్గరైపోయాడు. అందుకేనేమో.. నేటితరం పిల్లల్లో చాలామంది నాన్నకు ప్రేమతో దగ్గరైపోయారు.

■ ప్రస్తుతం ఫాదర్స్ డే అంటూ ఓ కొత్త పండుగ సంస్కృతిగా మారిపోయింది. మాతృ దినోత్సవం మాదిరిగానే దీనికి ప్రపంచం అంతటా ప్రాధాన్యం పెరిగిపోయింది. జూన్ నెలలో మూడో ఆదివారం దీనిని పాటిస్తున్నారు. అప్పట్లో నాన్న పట్ల ఉండే భయం.. ఇప్పుడు స్నేహంగా మారిపోయింది. అప్పట్లో కనిపించే ఆరాధనాభావం ఇప్పుడు స్ఫూర్తిమంత్రంగా తయారైంది. పిల్లలు ఏదైనా తప్పు చేస్తే మీ నాన్నకు చెబుతా అని అప్పట్లో ఎవరైనా బెదిరిస్తే పిల్లుల్లా బెదిరిపోయే పిల్లలు.. ఇప్పుడు అన్నీ వారే తండ్రికి చెప్పేస్తున్నారు. ఇందుకు సమాజంలో వచ్చిన ఆధునిక సౌకర్యాలు, అక్షరాస్యత, టెక్నాలజీ, మనోవికాసం, ఆర్థిక స్థోమత వంటి పరిణామాలన్నీ తండ్రి– పిల్లల వైఖరిని మలుపు తిప్పాయి.

వెన్నంటి ప్రోత్సాహం



నా చిన్నప్పటి అన్ని విషయాల్లో మా నాన్నే ఆదర్శం. ఇంజినీరింగ్ అయిన తర్వాత ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చినా.. నిర్దేశించుకున్న ఐఏఎస్ లక్ష్యాన్ని సాధించేందుకు అందులో చేరలేదు. సివిల్స్ రెండు ప్రయత్నాల్లోనూ సాధించలేకపోయా. ఆ సమయంలో మా నాన్న కొండంత అండగా నిలిచి.. వెన్నంటి ప్రోత్సహించారు. మూడో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించా. మా నాన్న వల్ల, మా కుటుంబ సభ్యుల అండదండలతో నేను అనుకున్న లక్ష్యాన్ని సాధించగలిగాను.

– బీఎం సంతోష్, కలెక్టర్, జోగుళాంబ గద్వాల

పిల్లల్లో తండ్రుల పోలికలే అధికం

సాధారణంగా పిల్లల్లో ఎక్కువగా తండ్రి పోలికలు, **గుణాలే** ఉంటాయి. దీనికి **జన్యుపరమైన** అంశాలే **కారణమని** యూనివర్సిటీ **ఆఫ్** నార్త్ కరోలినా నిర్వహించిన **ఓ** అధ్యయనం తేల్చింది. **పిల్లలను** ఇంట్లో ఒంటరిగా **వదిలి వెళ్లినప్పుడు** తల్లి కంగారు పడి **పోతుందని** అందరికీ తెలుసు. కానీ, **ఉద్యోగం చేస్తూ** పిల్లలను సాకుతున్న తండ్రులు కూడా పిల్లలను ఇంట్లో వదిలివెళ్లినప్పుడు అంత కంటే ఎక్కువగానే బాధపడతారట. ఒక సందర్భంలో వారు ఉద్యోగ బాధ్యతలు వదిలించుకోవడానికి సిద్ధపడటంతో పాటు పిల్లల కోసం భార్యతో ఇంటి పనులను పంచుకోవడానికి ఎక్కువ మంది తండ్రులు ఇష్టంగా ఉంటారని తేలింది. ఉద్యోగం, ఇల్లు సమాజం కన్నా పిల్లలతో కలిసి జీవించడం.. వారితో కలిసి ఆడుకోవడమే ఇష్టమని చెప్పిన తండ్రులే ఎక్కువని తెలుస్తోంది.

అన్ని విషయాల్లో తోడుగా నిలిచారు..



తండ్రితో నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్

దేశంలోనే ఉన్నతమైన సివిల్ సర్వీసెస్ సాధించడంలో నాన్న ప్రోత్సాహం ఎంతో ఉంది. నాన్న సరోజ్ కుమార్ చిన్నతనం నుంచి అన్ని విషయాల్లో తోడుగా నిలిచారు. ఆయన వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్‌లో ఈఈగా పనిచేస్తున్న సమయంలోనూ నా చదువు విషయంలో ఎంతో కేర్ తీసుకున్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాల్లోనూ ప్రావీణ్యం ఉండాలని వాటిని నేర్పించారు. రాత్రివేళలో చదువుకునేటప్పుడు టీ ఇవ్వడం, పరీక్షల సమయంలో దగ్గరుండి డ్రాప్ చేయడం, బాధలో ఉంటే ధైర్యం చెప్పడం నాన్నతో నాకున్న తీపి జ్ఞాపకాలు. నిరుత్సాహ పడుతున్న వేళ వెన్నంటి ప్రోత్సహించి అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి నా కన్నా.. నాన్నే ఎక్కువ కష్టపడ్డారు. అన్ని విషయాల్లో ఒక మంచి స్నేహితుడిగా అండగా నిలిచారు. థాంక్యూ మై డాడ్..


సాయం చేసే గుణం అలవడింది..



తల్లిదండ్రులతో ఎస్పీ వైభవ్ గైక్వాడ్

'మా నాన్న పేరు రఘునాథ్ గైక్వాడ్. చిన్నప్పటి నుంచి నాకు మా నాన్నే రియల్ హీరో. నా బాల్యం నుంచి ఆయన కిరాణ షాపు నిర్వహిస్తూ మా చదువుల కోసం ఎంతో కష్టపడ్డారు. మా చదువు, ఉద్యోగాన్వేషణలో నిరంతరం వెన్నంటి ప్రోత్సహించారు. ఆయన నుంచి కష్టించి పనిచేసే తత్వాన్ని, ఇతరులకు సాయం చేసే గుణాన్ని నేర్చుకున్నా. పిల్లల కోసం కష్టపడుతున్న నాన్నలందరికీ హ్యాపీ ఫాదర్స్ డే.

– వైభవ్ గైక్వాడ్, ఎస్పీ, నాగర్‌కర్నూల్



అన్నింటా ముందుంటారు..



తండ్రి పెంపకంలో పెరిగిన వారు అతడితో అన్ని విషయాలు పంచుకుంటారు. ఇటు చదువు, అటు ఆటపాటలు అన్నింటా ముందుంటారు. అతడితో మెలిగిన పిల్లల వ్యవహారశైలి చాలా మర్యాదపూర్వకంగా ఉంటుంది. తండ్రి సంరక్షణలో పెరిగిన పిల్లలు తెలివైన వారుగా ఎదుగుతారు. ఈ విషయంలో నేటితరం తండ్రుల ఆలోచనా దృక్పథంలో కూడా చాలా మార్పు వచ్చింది.

– వంగీపురం శ్రీనాథాచారి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

అన్నీ తానై నడిపించారు..



మహేశ్వర్‌జీతో కుమార్తెలు, కుమారుడు

నవాబ్‌పేట: నాన్నంటే అభయమని.. అన్నింటా అండగా ఉండి నడిపిస్తాడని అంటున్నారు నవాబ్‌పేటకు చెందిన సుప్రియ, సుస్మిత, సందీప్. తమ అమ్మ చిన్ననాడే దూరమైనా నాన్నే.. అన్నీ తానై పెంచి పెద్ద చేశాడని చెబుతున్నారు. తండ్రి మహేశ్వర్‌జీ కష్టపడి తమను చదివించారని.. చిన్న వ్యాపారం చేస్తూ తమకు కష్టం తెలియకుండా పెంచారని పేర్కొంటున్నారు. అమ్మ ప్రేమకు దూరమయ్యామనే లోటును తెలియకుండా కంటికి రెప్పగా కాపాడుకుంటూ వచ్చారన్నారు. ఆయన కఠోర శ్రమ తాము ఎదగడానికి దోహదపడిందన్నారు. కాగా మహేశ్వర్‌జీ మొదటి కుమార్తె సుప్రియ ప్రభుత్వ వెటర్నరీ డాక్టర్‌గా, రెండో కుమార్తె సుస్మిత పోస్టల్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తుండగా, కుమారుడు సందీప్ ఎంబీబీఎస్ పూర్తి చేశారు.

జిల్లాలకు కొత్త బాస్‌లు

- ఉమ్మడి పాలమూరులో గద్వాల మినహా నాలుగు జిల్లాల కలెక్టర్లు బదిలీ
- మహబూబ్‌నగర్, నారాయణపేటకు మహిళా పాలనాధికారులు
- నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్‌కు పదోన్నతి బదిలీ



బి.విజేంద్ర, కలెక్టర్, మహబూబ్‌నగర్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాలకు కొత్త కలెక్టర్లు రానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా శనివారం జోగుళాంబ గద్వాల మినహా మిగిలిన నాలుగు జిల్లాల కలెక్టర్లు బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా బి.విజేంద్రను ప్రభుత్వం నియమించింది. 2006 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె ప్రస్తుతం ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ సెక్రటరీగా ఉన్నారు. అలాగే మంచిర్యాల కలెక్టర్‌గా ఉన్న బదావత్ సంతోష్ నాగర్‌కర్నూల్ జిల్లాకు రానున్నారు. 2016 బ్యాచ్‌కు చెందిన ఆయనను నాగర్‌కర్నూల్ కలెక్టర్‌గా నియమించగా, ప్రస్తుత కలెక్టర్ ఉదయ్‌కుమార్‌ను జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. హనుమకొండ కలెక్టర్‌గా పనిచేస్తున్న సిక్తా పట్నాయక్ (2014 బ్యాచ్) నారాయణపేట కలెక్టర్‌గా రానున్నారు. ప్రస్తుత కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. వనపర్తి కలెక్టర్‌గా 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆదర్శ్ సురభి నియమితులయ్యారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఆయనకు ప్రభుత్వం కలెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. ఇక్కడ కలెక్టర్‌గా ఉన్న తేజస్ నంద్‌లాల్ పవార్‌ను సూర్యాపేట జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా పనిచేస్తున్న కుమార్ దీపక్‌కు కలెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. ఆయనను మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

⇨ ఖమ్మం మున్సిపాలిటీ కమిషనర్‌గా ఉన్న ఆదర్శ్ సురభి వనపర్తి జిల్లాకు కలెక్టర్‌గా పదోన్నతిపై రానున్నారు. ఆయనకు ఇప్పటికే పెళ్లి కుదరగా, వచ్చే నెల 7న వివాహం చేసుకోనున్నారు. అడిషనల్ కలెక్టర్‌గా, మున్సిపల్ కమిషనర్‌గా సేవలందించిన ఆయన త్వరలో కలెక్టర్ హోదాలో ఇంటివాడు కానున్నారు. కాగా.. ప్రస్తుతం కలెక్టర్‌గా ఉన్న తేజస్ నంద్‌లాల్ పవార్ గతేడాది కలెక్టర్ హోదాలోనే వివాహం చేసుకోవడం విశేషం.

నాగర్‌కర్నూల్ కలెక్టర్ ప్రొఫైల్



పేరు: బదావత్ సంతోష్
కేడర్: 2016 ఐఏఎస్ బ్యాచ్
పుట్టినతేదీ: 24 - 03 - 1991
స్వస్థలం: వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం
విద్యార్హత: డిగ్రీ, ఎన్ఐటీ, వరంగల్
విధులు: మంచిర్యాల జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ అడిషనల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు.

వనపర్తి కలెక్టర్ ప్రొఫైల్



పేరు: ఆదర్శ్ సురభి
కేడర్: 2018 ఐఏఎస్ కేడర్
పుట్టినతేదీ: 21-03-1994
తల్లిదండ్రులు: తండ్రి సత్తయ్య (గ్రూప్ 1 అధికారి), తల్లి సర్వమ్మ, రిటైర్డ్ ఐఆర్ఎస్
విద్యార్హత: ఢిల్లీలో డిగ్రీ పూర్తిచేశారు
స్వస్థలం: కరీంనగర్ జిల్లా, తెలంగాణ
విధులు: ఖమ్మం మున్సిపాలిటీ కమిషనర్‌గా 2021 నుంచి పనిచేస్తున్నారు. ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్(లోకల్‌బాడీస్), ఖమ్మం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేశారు.

నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రొఫైల్



పేరు: సిక్తా పట్నాయక్
కేడర్: 2014 ఐఏఎస్ బ్యాచ్
పుట్టిన సంవత్సరం: 1987
స్వస్థలం: గంజాం (ఒడిశా)
భర్త: ప్రొఫెసర్ జీవంత్ రాంపాల్ (ఐఐఎం అహ్మదాబాద్)
సంతానం: సారంగ్‌తో పాటు మరో పాప
తొలి పోస్టింగ్: నల్లగొండ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్
పని చేసిన ప్రాంతాలు: బోధన్ సబ్‌కలెక్టర్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ 2019-20లో పెద్దపల్లి కలెక్టర్, 2020 జూన్ నుంచి ఆదిలాబాద్ కలెక్టర్‌గా, 2020లో హనుమకొండ కలెక్టర్‌గా అదనపు బాధ్యతు నిర్వర్తించారు.

సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ



మూడు పెద్ద ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడం నాకు చాలా సంతృప్తినిచ్చింది. 2023 నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు, 2024 ఎంపీ, స్థానిక సంస్థల ఉప ఎన్నికలు నా హయాంలోనే జరిగాయి. 2023 ఫిబ్రవరి 1న కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టానని భావిస్తున్నా. ప్రధానంగా ధరణి సమస్యలతో పాటు ప్రజావాణిలో వచ్చే ప్రజా ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు చేరుకావడం సంతోషంగా ఉంది. జిల్లా ప్రజలు నాపై చూపిన ప్రేమాభిమానాలను ఎప్పటికీ మరచిపోను.

– రవినాయక్, కలెక్టర్, మహబూబ్‌నగర్

ప్రజావాణిలో ప్రత్యేక ముద్ర..

నాగర్‌కర్నూల్ కలెక్టర్‌గా 2021 ఆగస్టు 30న ఉదయ్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. జిల్లాలో సుమారు మూడేళ్ల పాటు ఆయన సేవలందించారు. ప్రధానంగా ధరణిలో భూసమస్యల పరిష్కారం, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని నామమాత్రంగా నిర్వహించకుండా, సమస్యల పరిష్కారానికి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను అక్కడికక్కడే సంబంధిత విభాగాల అధికారులతో పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులు మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండాలని, వీలైన పనులను అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులను నిర్దేశించారు.

చెంచుల కోసం పనిచేయడం సంతృప్తినిచ్చింది..



జిల్లాలో సుమారు మూడేళ్ల పాటు పనిచేశాను. నల్లమలలోని మారుమూల చెంచు కుటుంబాల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేయడం నాకు సంతృప్తినిచ్చింది. ఎన్నో సందర్భాల్లో వీలైనప్పుడల్లా వారిని కలుసుకునేందుకు అటవీప్రాంతంలోని చెంచుపెంటలకు వెళ్లాను. ఎన్నికల సమయంలోనూ మారుమూల చెంచు ఆవాసాల్లోని చెంచులకు ఓటుహక్కు కల్పించేందుకు ఉపకేంద్రాలను ఏర్పాటుచేయడం, ఓటింగ్ ప్రక్రియలో వారిని భాగస్వాములను చేయడం సంతృప్తిని కలిగించింది.

– ఉదయ్ కుమార్, కలెక్టర్, నాగర్‌కర్నూల్

విద్య, వైద్యరంగాలపై దృష్టి

నారాయణపేట జిల్లాలో కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్య, వైద్య రంగాలపై ప్రధానంగా దృష్టిసారించారు. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు– మనబడి పథకం కింద మొదటి దశలో ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంలో చురుకైన పాత్ర పోషించారు.ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు సేవలు అందించేందుకు ఆకస్మిక తనిఖీలు చేపట్టడం.. ఆస్పత్రిలో చిన్నపాటి మరమ్మతు చేయించి ప్రజల మన్ననలు పొందారు. అలాగే ప్రభుత్వ అధికారులు సమయపాలన పాటించేలా చొరవచూపారు. అధికారులు సమయానికి రాకపోతే వారిపై చర్యలు తీసుకోవడంతో ఒకింత అధికారుల్లో దడ పుట్టించింది. మన వాహనం – మన ఇసుక ఆన్‌లైన్ ద్వారా ఇసుక రీచ్‌ల నుంచి పకడ్బందీగా అమలు చేయడంలో కలెక్టర్ చర్యలు తీసుకోవడంతో సామాన్య ప్రజలు హర్షం వెలిబుచ్చారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి

అమరచింత: రాజకీయాలకు అతీతంగా ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వ పరంగా అందించే సంక్షేమ పథకాలను అందించడం కోసం ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. నియోజకవర్గానికి మంజూరైన రూ.1,600 కోట్లతో, అమరచింత మండలానికి రూ.2 కోట్లతో సీసీ రహదారులు, రూ.50 లక్షలతో తాగునీటి ఎద్దడి నివారణ, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.1.60 లక్షలు, జెడ్పీ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులకు రూ.10 కోట్లు మంజూరయ్యాయన్నారు.

వచ్చే ఏడాది నుంచి జూనియర్ కళాశాల...

వచ్చే ఏడాది అమరచింత మండలానికి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మంజూరు చేయించి, ఇక్కడి విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి 49 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీపీ డాక్టర్ మాలతి, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సరోజ, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ చాంద్ పాషా, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దుంపాయికుంట లబ్ధిదారులకు పట్టాలివ్వండి

అమరచింత: పట్టణంలోని దుంపాయి కుంటలో లబ్ధిదారులు గుడిసెలు వెసుకొని ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్నారని, వారికి ప్రభుత్వం వెంటనే ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గతేడాదిన్నర నుంచి అప్పట్లో ఇంటి పట్టాలను పొందిన లబ్ధిదారులు తమకు పట్టాల ప్రకారం స్థలాల పొజీషన్ చూపాలని ఆందోళన చేస్తుండగా.. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వం లబ్ధిదారులకు అన్యాయం చేసిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టాలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఇంటి నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామని తెలియజేసి, సమస్యను గాలికి వదిలిందన్నారు. ఇన్నాళ్లు ఎన్నికల కోడ్ అని సమస్యను దాటవేసిందని, ఇప్పటికైనా దుంపాయికుంట లబ్ధిదారుల సమస్యను స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహమూద్, అజయ్, బుచ్చన్న, కురుమన్న, శ్రీనివాసులు, వసంత, మాణిక్యమ్మతో పాటు పలువురు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు జాన్‌వెస్లీ

చెక్‌పోస్టు ఆకస్మిక తనిఖీ



అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారి పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఉన్న సరిహద్దు చెక్‌పోస్టును జిల్లా పశుసంవర్ధక శాఖ వెంకటేశ్వర్లు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. సరిహద్దు వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి తగు సూచనలు చేశారు. పశువులు అక్రమ రవాణా జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా పశువులను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్‌పోస్టు వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు.

ఆలయంలో అభివృద్ధి పనులకు అంచనాలు

ధరూరు: మండల పరిధిలోని పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని దేవాదాయ శాఖ డీఈ శ్రీనివాస్‌శర్మ సూచించారు. అందులో భాగంగానే ప్రణాళిక, అంచనాలను రూపొందించేందుకు గాను ఇక్కడికి వచ్చినట్లు తెలియజేశారు. శనివారం రాత్రి 7 గంటలకు డీఈ శ్రీనివాస్‌శర్మ ఆలయానికి చేరుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆయనకు ఆలయ ధర్మకర్త గిరిరావు, ఆలయ కార్యనిర్వహణాధికారిణి కవితలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం డీఈ విలేఖరులతో మాట్లాడారు. రూపొందించిన ప్రణాళిక, అంచనాలను ఉన్నతాధికారులకు నివేదించి, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించే చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

నీటిగుంతలో పడి రైతు మృతి



కర్ణాకర్‌రెడ్డి (ఫైల్)

బిజినేపల్లి: మండలంలోని మహాదేవునిపేటకు చెందిన రైతు కర్ణాకర్‌రెడ్డి (48) పొలం వద్ద నీటి గుంతలో పడి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. తన వ్యవసాయ పొలం వద్ద నీటి గుంతలో ఉన్న మోటారుకు నాచు తొలగించాలని అందులోకి దిగాడు. ప్రమాదశావత్తు అదే సమయంలో మూర్ఛ రావడంతో గుంతలో జారి పడ్డాడు. చుట్టు పక్కన ఎవరూ గమనించకపోవడంతో కర్ణాకర్‌రెడ్డి నీటి గుంతలో మునిగి చనిపోయాడు. కాసేపట్లో వస్తానని పొలానికి వెళ్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పక్క పోలం రైతులకు సమాచారమిచ్చారు. వారు నీటిగుంత వద్దకు వచ్చి చూడగ కర్ణాకర్‌రెడ్డి గుంతలో పడి చనిపోయి ఉండటం గమనించి కుటుంబ సభ్యులకు, సమాచారం అందించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: లారీ డ్రైవర్ అతివేగంగా ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం.. కేశంపేట్‌కు చెందిన సయ్యద్ తౌసిఫ్ అన్వర్ అలీ(20) జిల్లా కేంద్రంలోని రామయ్యబౌలిలో ఉంటూ స్విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం కళాశాల నుంచి మహబూబ్‌నగర్‌కు స్కూటీపై అతని స్నేహితుడు ఖలీల్‌తో కలిసి వస్తుంటే మార్గమధ్యలో ధర్మపూర్ వద్ద మహబూబ్‌నగర్ నుంచి దేవరకద్ర వైపు వెళ్తున్న లారీ వేగంగా ఢీకొట్టడంతో సయ్యద్ తౌసిఫ్ అన్వర్ అలీకి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో విద్యార్థి ఖలీల్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

చెంచు విద్యార్థి ఆత్మహత్యపై కేసు నమోదు

లింగాల: మండలంలోని రాంపూర్‌పెంటకు చెందిన చిగుర్ల రాముడు ఆత్మహత్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ శనివారం తెలిపారు. ఫోన్ ఎక్కువగా వాడకంపై తల్లి చిగుర్ల లింగమ్మ మందలించడంతో మనస్తాపానికి గురై ఈ నెల 11న వారి ఇంటి సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి



కొత్తకోట రూరల్: కుక్కలు దాడి చేయడంతో 30గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లికి చెందిన వంగూర్ రాములు, గౌనికాడి మల్లేష్‌లకు చెందిన గొర్రె పిల్లల మందపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధిత గొర్రెల కాపరులు వాపోయారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం



పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులతో ఆదిశిలాక్షేత్రం ఆవరణ మొత్తం పోటెత్తింది. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రమేషాచారి, రవిచారి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదే విధంగా కొంత మంది భక్తులు స్వామి వారికి దాసంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ, వాల్మీకి పూజారులు తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు



చెర్మ్యాకర్ సమీపంలో డీ-82 కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

కల్వకుర్తి రూరల్/ వెల్దండ: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తి చేసి చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఏళ్లతరబడిగా పనులు అసంపూర్తిగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో కేఎల్ఐ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టే విధంగా అధికారులకు సూచనలు చేశామన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన కేఎల్ఐ పథకానికి భూములిచ్చిన రైతులకు రూ.19 కోట్ల నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టామన్నారు. వెల్దండ మండలం భర్కత్‌పల్లి వద్ద నిలిచిపోయిన పనులను ప్రారంభించామని చెప్పారు. డీ-82లో పనులు వేగవంతం చేయాలని, ఇప్పటి వరకు మొదలుపెట్టని పనులు వెంటనే చేపట్టాలన్నారు. రైతులకు సాగునీరు అందించాలనే సంకల్పంతోనే పనిచేద్దామన్నారు. ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తెస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం వెల్దండ మండలంలోని చెర్మ్యాకర్, భర్కత్‌పల్లి గ్రామాల సమీపంలో అసంపూర్తిగా ఉన్న డీ-82 కాల్వ పనులను పరిశీలించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతంగా, నాణ్యతగా చేపట్టి జూలై చివరి నాటికి పూర్తి చేయిస్తామన్నారు. కేఎల్ఐ కాల్వ ద్వారా వచ్చే నీరు ఈ ఏడాది చివరి ఆయకట్టు మాడ్గుల మండలం నాగిళ్ల వరకు అందిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈ శ్రీకాంత్, డీఈఈ దేవానంద్, ఏఈ విశ్వనాథం, శ్రీనివాస్, సప్తగిరి, నాయకులు సంజీవ్ కుమార్, ఆనంద్‌కుమార్, రాజశేఖర్, గోపాల్‌నాయక్, అశోక్‌రెడ్డి, ఆనంద్, రామకృష్ణ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ

కల్వకుర్తి నియోజకవర్గంలో 100 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని ఎమ్మెల్యే చెప్పారు. డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులతో భూసేకరణ కోసం సమీక్ష నిర్వహించారు. కల్వకుర్తి, వెల్దండ ప్రాంతాల్లో వంద ఎకరాల స్థలం ఎక్కడైనా ఉందా.. అని తెలుసుకున్నారు. కల్వకుర్తి పట్టణంలోని సర్వే నం.99లో 3 ఎకరాల భూమిని ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఏ విధంగా ఉపయోగించుకోవచ్చు అనే విషయంపై ఆరా తీశా రు. 100 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

కష్టపడి పనిచేసి ఆర్టీసీకి మరింత ఆదాయం తేవాలి

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి



ఆదర్శ ఉద్యోగులతో ఆర్టీసీ అధికారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగులు మరింతగా కష్టపడి పనిచేసి డిపోకు మరింత ఆదాయం తేవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో గత నెలలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, నగదు పారితోషికం అందజేసి అభినందించారు. ఆర్ఎం మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయాలని సూచించారు. లక్షే లక్ష్యం మీద ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన వారికి ఆర్ఎం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు లక్ష్మీదుర్గ, శ్యామల, డిపో మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బస్టాండ్‌లో ఆర్టీసీ కళాజాత బృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది.

పోలీస్ పహారా మధ్య సంజీవ్ అంత్యక్రియలు



సంజీవ్ అంతిమయాత్ర నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు

భారీగా తరలివచ్చిన జనం, బంధువులు

నారాయణపేట: భూ తగాదాలో హత్యకు గురైన గువ్వలి సంజీవ్(28) అంత్యక్రియలు నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం చిన్నపొర్లలో పోలీసుల పహారా మధ్య శనివారం నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు కాకుండా డీఎస్పీ మహేష్ పర్యవేక్షణ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను తెలంగాణ ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామన్న, జిల్లా అధ్యక్షుడు కృష్ణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, బీఆర్ఎస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్, రమేష్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, భార్యకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్ఐని సస్పెండ్ చేయడం కాదని, ఉద్యోగం నుంచే తొలగించాలని ఎస్పీకి ఫిర్యాదు చేస్తూ ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- 16 మంది అరెస్ట్
- వాహనాలు, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

బిజినేపల్లి: మండలంలోని వట్టెం, కోడుపర్తి గ్రామ శివారుల్లో 30 మందితో నిర్వహించబడుతున్న పేకాటరాయుళ్ల శిబిరంపై డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఆయన కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం వట్టెం శివారులో నాగర్‌కర్నూల్‌కు చెందిన అల్లాజీ.. బిజినేపల్లి మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన కటికె శ్రీనుల ఆర్గనైజేషన్‌లో దాదాపు 30 మందితో పేకాట ఆడుతున్నారు. ఈ మేరకు విషయంపై పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో డీఎస్పీ, ఇతర అధికారులు ఆకస్మిక దాడి నిర్వహించారు. రూ.1.59 లక్షల నగదు, 14 సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 16 మందిని అరెస్టు చేశారు. కాగా మరో పదిమంది తప్పించుకున్నారని.. ఇంకా దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వివరించారు. దాడుల్లో నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్యగౌడ్, నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్, తిమ్మాజిపేట ఎస్ఐ నరేందర్‌రెడ్డి, బిజినేపల్లి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కఠిన చర్యలుంటాయి

పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా డీఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి శిబిరాల గురించి తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. వివరాలు తెలిపిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. పేకాట ఆడే వ్యక్తులను ఏమాత్రం ఉపేక్షించబోమని, కఠినంగా వ్యవహరిస్తామని ఘాటుగా హెచ్చరించారు.

గుప్తనిధుల తవ్వకాల కోసం యత్నం

నంది విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన నంది విగ్రహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

గద్వాల క్రైం: మండలంలోని పూడూరు గ్రామంలోని మల్లికార్జున దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం తెల్లవారుజమున తవ్వకాలు చేపట్టారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామ శివారులోని వెలసిన పురాతన దేవాలయంలోని నంది విగ్రహం ధ్వంసం చేసి గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. శబ్దం రావడంతో గ్రామస్తులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నం చేయగా తప్పించుకున్నారు. ఈ విషయంపై రూరల్ పోలీసుకు సమాచారం అందివడంతో ఘటనా స్థలం వద్దకు చేరుకుని ఆరా తీశారు. గ్రామంలోని అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉన్నట్లు గుర్తిస్తే పోలీసులకు తెలియజేయలన్నారు. గతంలోనూ ఈ గ్రామంలో పలువురు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన క్రమంలో పంచలోహాలతో కూడిన విగ్రహాలు, బంగారు నాణేలు బయటపడ్డాని గ్రామస్తులు తెలుపుతున్నారు. అప్పట్లో గద్వాల రాజులు పూడూరు రాజధానిగా ఏర్పాటు చేసుకుని పారిపాలించినట్లు గ్రామస్తులు వివరించారు. రాజుల కాలం నుంచి ఇక్కడి గ్రామంలో విలువైన నిధులు ఉంటాయని గుర్తించి పలు దేవాలయలను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుంది. తాజాగా తవ్వకాలు చేపట్టడంతో గ్రామంలో కలకలంగా మారింది.

పశువుల తరలింపు అడ్డగింత



పశువులతో ఉన్న వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న రూరల్‌సీఐ నాగార్జున గౌడ్

20 వాహనాలను స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు

రాజాపూర్: బాలానగర్ మండల కేంద్రంలో శనివారం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు 20 బొలెరో వాహనాల్లో పశువులను హైదరాబాద్‌కు తరలిస్తుండగా అడ్డుకున్నారు. వాహనాలన్నింటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటన విషయంలో వీహెచ్‌పీ, బీజేపీ కార్యకర్తలు అక్కడికి తరలివచ్చారు. కాగా జడ్చర్ల రూరల్‌సీఐ నాగార్జునగౌడ్ గోవులను ఎవరైన తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలను సీజ్ చేసే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా వాహనాల్లో ఉన్న పశువులను పరిశీలించి వాటిలో గోవులు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వైర్లు తెగిపడి 11 గేదెలు మృతి

రూ.8లక్షలకుపైగా నష్టం



లత్తిపురంలో మృతి చెందిన గేదెలు

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తెగి పడడంతో 11 గేదెలు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం మేరకు... లత్తిపురం చెందిన మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డిలకు సంబంధించిన గేదెలను శనివారం ఉదయం మేతకు తీసుకెళ్లారు. గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు కిందపడ్డాయి. వాటిని గమనించకుండా అటువైపు వెళ్లడంతో షాక్‌గురై అక్కడిక్కడే మృత్యువాతపడ్డాయి. గమనించిన రైతులు విద్యుత్ అధికారులకు తెలియజేశారు. సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మూగజీవాలు మృతి చెందడంతో రూ.8లక్షల నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా చేయూత అందించాల్సింగా కోరారు.

‘ఉపాధి’ పనులపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

రాజాపూర్: జాతీయ ఉపాధి హామీ పనుల్లో జరిగిన వివిధ పనులపై గత ఐదురోజులుగా మండలంలోని 12 గ్రామాల్లో సేకరించిన వివరాలతో శనివారం ప్రజావేదిక (సామాజిక తనిఖీ)నిర్వహించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉపాధికూలీల సమక్షంలో కార్యక్రమం జరిగింది. మండలకేంద్రంలో మూడేళ్లక్రితం జాతీయ రహదారికి ఇరువైపుల 2, 300 మొక్కలు నాటితే వాటిలో 800 వందలు మాత్రమే సంరక్షించబడ్డాయని తనిఖీలో తేలింది. విషయంపై కార్యదర్శి గోపాల్ సమాధానం ఇస్తూ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటామన్నారు. కాగా గ్యాస్ పైప్‌లైన్, మరోవైపు కేబుల్ పైప్‌లైన్ వేయడంతో సమస్య తలెత్తిందని.. విషయాన్ని ఉన్నతాధికారులకు కూడా వివరించామన్నారు. కాగా మొక్కలు పాడు చేసిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయించలేదని ప్రశ్నించగా.. గ్యాస్‌పైప్‌లైన్, కేబుల్ లైన్ ఏర్పాటు చేసిన వారు నష్టపరిహారంగా ఫారెస్ట్ శాఖకు డబ్బులు చెల్లించినట్లు పంచాయతీ కార్యదర్శి వివరించారు. ఇదిలా ఉంటే గ్రామాల్లో ఏర్పాటు చేసిన తొమ్మిది క్రీడాప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన బోర్డులు, సింగిల్‌బార్, డబుల్‌బార్ కోకో పోల్స్ తదితర వాటికి వాడాల్సిన మెటీరియల్ తక్కువగేజ్ వాడినట్లు ఒక్కోదానికి రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు సప్లయర్స్ నుంచి రికవరీ చేయాలని తనిఖీబృందం తీర్మానం చేసింది. జిల్లా అంబుడ్స్‌మెన్ సంతోష్, ఎంపీడీఓ మచ్చేందర్, స్పెషల్ ఆఫీసర్ స్నేహ, ఎస్ఆర్పీ శ్రీకాంత్, డీఆర్పీ రఘు, టీఏ సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్, మాజీ సర్పంచ్ బచ్చిరెడ్డి, నాయకులు నరహరి, సత్యయ్య, గోవర్ధన్, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

అంజన్న నామస్మరణతో మార్మోగిన బీచుపల్లి



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



భక్తులతో కిక్కిరిసిన బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రం శనివారం ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా నెల రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా చివరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, ఆకుపూజ చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు దాసంగాలతో మట్టి కుండలలో ప్రత్యేక నైవేద్యం వండి ఆంజనేయస్వామికి సమర్పించారు. భక్తుల కొనుగోళ్లతో పరిసరాల్లో వెలసిన వివిధ దుకాణాలు రద్దీగా మారాయి.

భూగర్భ విద్యుత్‌కేంద్రం రాష్ట్రానికి కీర్తి కిరీటం



చిన్నారెడ్డికి భూగర్భ కేంద్రం గురించి వివరిస్తున్న డీఈ సంపంగి

దోమలపెంట: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి శనివారం టీఎస్. జెన్‌కో పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ విద్యుత్తు కేంద్రాన్ని సందర్శించారు. ఆయనకు డీఈ సంపంగి కేంద్రంలోని యూనిట్లు, మెయిన్ కంట్రోల్ రూం నుంచి విద్యుత్ ఉత్పత్తి, గ్రిడ్‌కు విద్యుత్‌ను అనుసంధానం చేసే పద్ధతులను తెలియపరిచారు. భూగర్భ విద్యుత్ కేంద్రం తెలంగాణకు కీర్తి కిరీటంగా చిన్నారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో దోమల పెంట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.మోయిజ్, గురువయ్య, మున్నీరు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారిపై కాంగ్రెస్ నేత ఆరోపణలు

గద్వాల రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వంలో జోగులాంబ గద్వాల కలెక్టర్‌గా పనిచేసిన వల్లూరు క్రాంతి అవినీతికి పాల్పడ్డారని పీసీసీ అధికార ప్రతినిధి కేఎస్వీ చారి ఆరోపించారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. గట్టు లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో ముంపునకు గురవుతున్న, వక్ఫ్‌బోర్డు భూములలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. వాటిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. అక్రమాలకు పాల్పడిన కలెక్టర్ వల్లూరు క్రాంతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్ వల్లూరు క్రాంతికి వివరణ కోరేందుకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

బదిలీలపై జోరుగా ప్రచారం

మహబూబ్‌నగర్ క్రైం: ప్రభుత్వం ఇప్పటికే కలెక్టర్లను బదిలీలు చేయగా, త్వరలో ఎస్పీల సైతం మార్పు ఉంటుందని తెలుస్తుంది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో సైతం పలువురు పోలీస్ అధికారుల బదిలీలు అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా మహబూబ్‌నగర్ పట్టణంలో మూడు శాంతిభద్రత పోలీస్ స్టేషన్స్ ఉండగా ఒకటి ట్రాఫిక్, మరొకటి ఉమెన్ పీఎస్ ఉంది. ఆయా స్టేషన్స్‌కు ఎన్నికల ముందు సీఐలతో పాటు ఎస్ఐలకు పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం పట్టణంలో ఉన్న సీఐలు, ఎస్ఐలకు స్థాన చలనం కావొచ్చునని జోరుగా ప్రచారం సాగుతుంది. కొత్త ఎస్పీ వచ్చిన తర్వాత బదిలీలు ఉంటాయా? లేకపోతే ముందు ఉంటాయో చూడాల్సి ఉంది. పోలీస్ శాఖలో బదిలీలు కావొచ్చు అనేదాని వెనుక ఇసుక వ్యవహారమే కారణమా లేక ఇతర కారణాలు ఉన్నాయా? తెలియాల్సి ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

LAND FOR LEASE
■ శ్రీశైలం హైవేకి అనుకొని ముచ్చెర్ల క్రాస్‌లో 3000 గజాలు DTCP 95x288 ft, 3 పక్కల BT రోడ్డు E/F వ్యాపారాలకు అనుకూలం. సంప్ర।। 9441922102

HOUSE FOR SALE
■ Mahaboobnagar, Kamala Nehru cly, Bayamma Thota, INDP House 372 yds, House No. 1-4-130/4/A9, E/F, 2000 sft. Ph: 9949918256, 9440295825

SERVICES

OLD AGE HOME
■ ఒమేగా హోంకేర్ వంట / ఇంటిపని చేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, చిన్న పిల్లలను 24 గం।।లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్ ఫోన్ 8977639664 / 8977639665

CHANGE OF NAME
■ I, BUREMONI NARASEMHHA S/o BUREMONI BUCHAIAH, R/o H.No 1-9-104/1, Simhagiri, New Gunj, Mahabubnagar Town and Dist.T.G, hereby state that I have changed my name from PAKANATI NARSHIMULU S/o PAKANATI BUCHAIAH (old name) to BUREMONI NARASEMHHA (new name)
■ I, BUREMONI SHIREESHA W/o BUREMONI NARASEMHHA R/o H.No 1-9-104/1, Simhagiri, New Gunj, Mahabubnagar Town and Dist.T.G, hereby state that I have changed my name from P SHIREESHA W/o P NARSIMULU (old name) to BUREMONI SHIREESHA W/o BUREMONI NARASEMHHA (new Name)

ORTHOPEDIC SURGEON
■ డా।।యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 - 228888, 83412 98888.

WANTED
■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర।। 9391912949, 040-40123376
■ గైనకాలజిస్ట్ & OT టెక్నీషియన్ కావలెను. అన్ని సదుపాయాలు గల ములుగు, వరంగల్ లోని ఒక హాస్పిటల్‌లో ఫుల్ టైమ్ కొరకు సంప్రదించండి సెం. 9849015656.

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, [illegible] - సాక్షి మేనేజర్

ఆగని టీడీపీ దాడులు.. పెరిగిన విధ్వంసం

తీరు మారలేదు!

- మాజీ మంత్రి పేర్ని నాని ఇంటివైపు దూసుకెళ్లేందుకు టీడీపీ శ్రేణుల యత్నం
- రాళ్ల దాడి చేయడంతో పోలీసులకు గాయాలు
- పుంగనూరులో దళిత, బీసీ నేతలపై దాడి.. హత్యాయత్నం
- విజయవాడలో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లు, దుకాణాల కూల్చివేత



పల్నాడు జిల్లా గొట్టిపాళ్లలో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇల్లు

■ టీడీపీ నేతల దాడులు, దౌర్జన్యాలు, ఇళ్లు, శిలాఫలకాల ధ్వంసం వంటి దుశ్చర్యలు ఆగటం లేదు. మచిలీపట్నంలో విజయోత్సవ ర్యాలీ ముసుగులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. మాజీ మంత్రి పేర్ని నాని ఇంటి వైపు రాళ్లు విసరగా.. పోలీసులకూ రాళ్ల దెబ్బలు తగిలాయి. కర్నూలు జిల్లా దిగువచింతలకొండలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమశేఖర్‌పై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో దళిత నేత, ఇద్దరు బీసీ నాయకులపై టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారు. బీసీ నేత వెంకటరెడ్డి యాదవ్‌పై ఇనుప రాడ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతపురం జిల్లా మురడిలో పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త రవీంద్రనాథ్‌రెడ్డిపై దాడికి తెగబడ్డారు. ఇంట్లోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేశారు. విజయవాడలో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లు, దుకాణాల కూల్చివేశారు. మాజీ డిప్యూటీ మేయర్, మరో నాయకుడి కార్ల అద్దాలను ధ్వంసం చేశారు. టీడీపీ నేతల ప్రోద్బలంతో విజయవాడ నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణల పేరిట వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లను కూల్చివేశారు. పల్నాడు జిల్లా గొట్టిపాళ్లలో వైఎస్సార్‌సీపీ నేతల గృహాల్లోని సామగ్రిని దహనం చేశారు.

ఆగని ధ్వంసరచన

ఏపీలో కొనసాగుతున్న సచివాలయం, ఆర్‌బీకే శిలాఫలకాలు, ఆర్చిల ధ్వంసం

- తణుకు మండలం మండపాకలో సచివాలయం, ఆర్‌బీకే శిలాఫలకాల ధ్వంసం
- నూజివీడులో అభివృద్ధి పనుల శిలాఫలకాలు కూల్చివేత
- ప్రకాశం జిల్లా చినమనగుండంలో టీడీపీ శ్రేణుల దుశ్చర్య
- చీమకుర్తి నూతన మునిసిపల్ కార్యాలయంపై వైఎస్సార్ పేరు తొలగింపు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

చినబాబు బ్యాచ్ చిత్రహింసలు!

మోకాళ్లపై మోకరిల్లి లోకేష్ ఫ్లెక్సీ ఎదుట క్షమాపణ చెప్పాలని బెదిరించారు

- సీజేఐ, హైకోర్టు సీజే, మానవ హక్కుల కమిషన్‌కు బాధితుడు పాలేటి రాజ్‌కుమార్ ఫిర్యాదు
- నన్ను కిడ్నాప్ చేసి రాత్రంతా చిత్రహింసలకు గురి చేశారు
- ఆ దృశ్యాలను చిత్రీకరించి సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేశారు
- స్కూల్‌లో చదివే నా పిల్లలు అవమాన భారంతో ఇంటికొస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై విచ్చలవిడిగా దాడులు
- మానవ హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాలని విన్నపం

సాక్షి, అమరావతి: మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ అనుచరులు ఈనెల 9వతేదీన తనను కిడ్నాప్ చేసి రాత్రంతా చిత్ర హింసలకు గురి చేసినట్లు పెదవడ్లపూడికి చెందిన బాధితుడు పాలేటి రాజ్‌కుమార్ సుప్రీం కోర్టు, హైకోర్టు, జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశాడు. లోకేష్ ఫ్లెక్సీ ఎదుట మోకాళ్లపై కూర్చోబెట్టి బెదిరించి క్షమాపణ చెప్పించి చిత్రీకరించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి తన కుటుంబాన్ని మానసిక క్షోభకు గురి చేస్తున్నట్లు పేర్కొన్నాడు. వీటి ప్రభావంతో పాఠశాలలో చదువుతున్న తన పిల్లలు అవమానభారంతో ఇంటికొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. టీడీపీ నేతలు పదే పదే బెదిరింపులకు దిగుతున్నారని, తక్షణమే జోక్యం చేసుకుని అరికట్టకుంటే తన కుటుంబానికి ఆత్మహత్యే శరణ్యమని విన్నవించుకున్నాడు. ఈ మేరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జాతీయ మానవహక్కుల సంఘానికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదుపై చట్టప్రకారం పోలీసులతో విచారణ జరిపి వ్యక్తిగత, భావ ప్రకటన స్వేచ్ఛ, మానవ హక్కులను పరిరక్షించాలని కోరాడు. ఫిర్యాదులో ముఖ్యాంశాలు ఇవీ..

- మంగళగిరి నియోజకవర్గంలో 2019–24 మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను మా కుటుంబంతో కలసి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశా. ఎన్నికల ఫలితాలు వెల్లడైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలపై దాడులకు పాల్పడుతూ చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఆస్తులను ధ్వంసం చేస్తూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. నారా లోకేష్ అండదండలతో మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు పేట్రేగిపోతున్నారు.
- ఈ నెల 9వతేదీన సాయంత్రం 4.30 గంటల సమయంలో నారా లోకేష్‌కు సన్నిహితుడైన జవ్వాడి కిరణ్‌చంద్ అనుచరులు నరేంద్ర, షేక్ బాజీ, జానీ తదితరులు నేను మా అత్త ఇంట్లో ఉన్న సమయంలో మారణాయుధాలతో దాడి చేశారు. ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఏపీ 39 జీబీ 3333 వాహనంలో నన్ను కిడ్నాప్ చేసి గుర్తు తెలియని ప్రాంతానికి తరలించి రాత్రంతా చిత్రహింసలకు గురిచేశారు. నా చొక్కా విప్పించి నారా లోకేష్ ఫ్లెక్సీ ఎదుట మోకాళ్లపై మోకరిల్లి ముకుళిత హస్తాలతో క్షమాపణ చెప్పాలని బెదిరించి వీడియో చిత్రీకరించారు. ఈనెల 10వతేదీ తెల్లవారు జాము 4 గంటలకు బోయపాలెం వద్ద జాతీయ రహదారిపై వదిలేసి వైఎస్సార్ సీపీకి మద్దతు పలికితే ఎవరికైనా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు.
- నాపై దాడి చేసిన వారిపై అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు (ఎఫ్ఐఆర్ నెంబరు 78/2024) చేశా. ఫిర్యాదు వాపసు తీసుకోవాలంటూ టీడీపీ మద్దతుదారులు పదే పదే ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు నా ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.
- మానవ హక్కులను కాలరాయడంపై తక్షణమే జోక్యం చేసుకుని టీడీపీ నేతలు, కార్యకర్తల నుంచి నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించాలి. నా ఫిర్యాదుపై చట్టప్రకారం విచారణకు ఆదేశించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నా.

‘సెర్చ్’ ఏదీ ?

- వర్సిటీల వీసీల ఎంపికకు ఇంకా భేటీ అవ్వని కమిటీలు
- మూడువారాలుగా ఐఏఎస్‌ల చేతుల్లోనే ఇన్‌చార్జ్ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్ : యూనివర్సిటీల వీసీల నియామకంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్ల(వీసీ) ఎంపికకు సంబంధించి ప్రభుత్వం నియమించిన సెర్చ్ కమిటీలు ఇప్పటివరకూ ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. అన్ని వర్సిటీల్లోనూ ఐఏఎస్‌లే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వారికి ఇతర బాధ్యతలు ఉండటంతో వర్సిటీలపై పెద్దగా దృష్టి పెట్టలేకపోతున్నారు. సాధారణ కార్యకలాపాలకు కూడా అధికారుల అనుమతి తీసుకోవాల్సి వస్తోంది. ఐఏఎస్‌లంతా హైదరాబాద్‌లోనే ఉండటంతో వర్సిటీల్లోని సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. విద్యా సంవత్సరం మొదలవ్వడంతో వర్సిటీలు కీలకమైన బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. జేఎన్‌టీయూహెచ్‌లో అనుబంధ గుర్తింపు, కోర్సుల మార్పిడి వంటి వాటి విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రైవేట్ కాలేజీలు అంటున్నాయి. మరోవైపు ఐఏఎస్‌లు అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఉన్నత విద్యామండలి కూడా యూనివర్సిటీ వ్యవహారాలపై ముందుకెళ్లే పరిస్థితి లేదు. కొత్త కోర్సులు, వాటికి సంబంధించిన బోధన ప్రణాళికపై ఏ నిర్ణయం తీసుకునే అవకాశం లేకుండాపోయిందని మండలివర్గాలు అంటున్నాయి. వీసీల పదవీ కాలం మే 21తో ముగిసింది. దీంతో కొత్తవారి నియామకానికి ప్రభుత్వం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఐఏఎస్ అధికారులకు వీసీలుగా అదనపు బాధ్యతలు అప్పగించింది.




సెర్చ్ కమిటీలు ఏమైనట్టు?

వీసీ ఎంపికకు గత నెలలోనే ప్రభుత్వం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. నిపుణులతో కూడిన ఈ కమిటీలు వచ్చిన దరఖాస్తులను వడపోయాలి. అంతిమంగా ముగ్గురిని ఎంపిక చేసి, ప్రభుత్వానికి సిఫార్సు చేయాలి. ఇందులోంచి ఒకరిని ప్రభుత్వం వీసీగా నియమిస్తుంది. మూడు వారాలైనా ఇంతవరకూ సెర్చ్ కమిటీల భేటీ జరగలేదు. వీసీల ఎంపికలో తీసుకోవాల్సిన ప్రామాణిక అంశాలేమిటో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. పెద్దఎత్తున దరఖాస్తులు రావడం, అందరూ సాంకేతికంగా వీసీ పోస్టులకు అర్హులే కావడంతో సెర్చ్ కమిటీ స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అవకాశం కనిపించడం లేదని తెలుస్తోంది. వీసీల ఎంపికలో ప్రభుత్వానికి కొన్ని రాజకీయ ప్రాధాన్యతలూ ఉంటాయని నిపుణులు అంటున్నారు. సామాజిక ప్రాధాన్యత ఇందులో కీలకమని భావిస్తున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ఎంపిక జరగాల్సి ఉన్నప్పుడు స్పష్టత లేకుండా మేమేం చేయగలమని వారు అంటున్నారు.

ఒత్తిడే కారణమా...?

- ప్రధాన యూనివర్సిటీల వీసీల కోసం పెద్దఎత్తున ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి వస్తున్నట్టు తెలుస్తోంది.
- అత్యధికంగా ఇంజనీరింగ్ కాలేజీలకు గుర్తింపు ఇచ్చే జేఎన్‌టీయూహెచ్ వీసీ కోసం కేంద్ర స్థాయిలో కాంగ్రెస్ పెద్దల నుంచే సిఫార్సులు వచ్చినట్టు సమాచారం. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ మంత్రి వీసీ పోస్టుకు దరఖాస్తు చేసిన ఓ వ్యక్తి కోసం పట్టుబడుతున్నారు. మరోవైపు నిజామాబాద్‌కు చెందిన మరో కాంగ్రెస్ కీలకనేత మైనారిటీకి చెందిన మరో ప్రొఫెసర్‌కు ఇప్పించేందుకు ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. జేఎన్‌టీయూహెచ్ వీసీ పోస్టుకు ఎన్ఐటీలో పని చేస్తున్న రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి పట్ల సీఎంకు సానుకూలత ఉన్నట్టు తెలిసింది. అయితే, తన మాట కన్నా పార్టీలో పెద్దవారికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని సమాచారం. ఈ కారణంగానే ఇక్కడ సెర్చ్ కమిటీ ఇంతవరకూ భేటీ అవ్వలేదని తెలుస్తోంది.
- ఉస్మానియా యూనివర్సిటీ వీసీ పోస్టుకు ఓ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కోసం విద్యాశాఖ ఉన్నతాధికారి కూడా పావులు కదుపుతున్నారు. సామాజిక కోణంలో ఈ ప్రతిపాదన తీసుకొస్తున్నా, యూనివర్సిటీ వర్గాల నుంచి ఆయనపై తీవ్ర వ్యతిరేకత ఉందని తెలుస్తోంది.
- బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ వీసీ పోస్టుకు కూడా జాతీయ, రాష్ట్ర స్థాయి నేతల చేత పైరవీలు జోరుగా సాగుతున్నాయి. ఈ తరహా ఒత్తిడి రావడంతోనే ప్రభుత్వం సెర్చ్ కమిటీలకు అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వలేకపోతోందని ఉన్నతవిద్య వర్గాలు చర్చించుకుంటున్నాయి.

వనపర్తి జిల్లాలో పండిత గల్లు, ఆత్మాహుతి శిల్పం





సాక్షి, హైదరాబాద్: వనపర్తి జిల్లాలో పండిత గల్లు, మహిళ ఆత్మాహుతి శిలలు వెలుగు చూశాయి. ఇందులో పది/పదకొండు శతాబ్దికి చెందిన పండిత శిల అరుదైనది కావటం విశేషం. శత్రువులు, క్రూర జంతువులతో ఆయా ప్రాంతాలను రక్షించే క్రమంలో.. మరణించేవారికి గుర్తుగా అప్పట్లో వీరగల్లులు ఏర్పాటు చేసేవారు. అదే తరహాలో ఆయా ప్రాంతాల్లో అసమాన ప్రతిభ కనబరిచిన పండితులకూ గుర్తింపు శిలలను ఏర్పాటు చేసేవారు. ఇవి చాలా అరుదుగానే వెలుగు చూస్తున్నాయి. తాజాగా వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సూగూరు గ్రామం పాటిగడ్డమీద ఇది కనిపించింది. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు చంద్రశేఖర్, శ్యాంసుందర్‌లు దీన్ని గుర్తించారు. సమీపంలోనే, ఆత్మాహుతి చేసుకుని భక్తురాలి స్మారక శిల కూడా కనిపించింది.

పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో జూరాల

- కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతో.. నీటిమట్టం పూర్తిస్థాయికి చేరువలో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు వివరించారు. శనివారం ప్రాజెక్టుకు 9,259 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పేర్కొన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా 406 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 133 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు ఇలా.. మొత్తం ప్రాజెక్టు నుంచి 1,504 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.894 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రామన్‌పాడులో 1,018 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి లెవల్ పెరుగుతోంది. జూరాల సమాంతర కాల్వ ద్వారా నీటిని వదులుతున్నారు. శనివారం నాటికి పూర్తి నీటిమట్టం 1,018 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. సమాంతర కాల్వ ద్వారా 470 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ. సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

పేదలకు ఉచితవైద్యం అందించాలి

ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్ క్రైం: వైద్య విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని వృత్తికి పేరు తీసుకురావాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఫాథర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడారు. వైద్య విద్యార్థులు రోగ రహిత సమాజాన్ని ఏర్పాటుకు తోడ్పడేలా ఎదగాలన్నారు. చదువు పూర్తయిన తర్వాత పేదప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వపరంగా అందించే అన్ని సదుపాయాలు సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలో నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలను మొదటిస్థానంలో నిలపాలని అన్నారు. రాష్ట్రం సాధించిన తర్వాతే వైద్యకళాశాలలు ఏర్పాటు చేసేందుకు సాధ్యమయిందని అన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర సర్కార్ చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులు తమ చదువును పూర్తి చేసుకున్న తర్వాత రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే తమ సేవలను ప్రజలకు అందించాలని సూచించారు. కళాశాలలో ఏవైనా సమస్యలు ఉంటే అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని.. వాటి పరిష్కారం కోసం పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఎంపీ మల్లురవి మాట్లాడుతూ తాను మెడిసిన్ పూర్తి చేసి ప్రజలకు వైద్యం అందించానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎన్నో పథకాలు తీసుకువచ్చిందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘు, మెడికల్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ మొయినోద్దీన్ పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి జూపల్లి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

ప్రారంభమైన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

నేడు గరుడ ముద్ద ప్రసాదం పంపిణీ

నాగర్‌కర్నూల్: సుమారు 500 ఏళ్ల చరిత్ర కలిగిన నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం శ్రీ రంగనాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి అభిషేకం, తిరుమంజనం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యావచనం, రక్షా బంధనం, అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రంగాచార్యులు, ప్రధాన అర్చకులు వినోదాచార్యులు, మురళీధరచార్యులు, అచ్యుత చార్యులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీమహావిష్ణువునకు అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు సంకేతంగా అటు సకల దేవతలకు, ఇటు మానవజాతికి తెలిపేలా గరుడపట ధ్వజారోహణం చేపట్టనున్నారు. అష్టదిక్పాలకులు, పంచలోక పాలకులు, దేవతలకు ఆహ్వానించే భేరి పూజ వైభవంగా జరగనుంది. అంతేకాకుండా గరుడ పట ధ్వజారోహణం సందర్భంగా నైవేద్యంగా పెట్టిన గరుడ ముద్ద ప్రసాదాన్ని సంతానం కోరుకునే దంపతులకు అర్చకులు పంపిణీ చేయనున్నారు. కాగా ఈ ప్రసాదాన్ని స్వీకరించిన సంతానం లేని మహిళలకు, రుగ్మతలతో బాధపడే వారికి మేలు జరుగుతుంది అనేది స్థానిక భక్తుల నమ్మకం. స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రమే గరుడ ముద్దలు పంపిణీ చేసే కార్యక్రమం ఉండడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందని ఆలయ ధర్మకర్త రంగాచార్యులు వివరించారు.



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

అగ్నివీర్ ఉద్యోగులకు ఘనసన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న కోచ్ గిరి

షాద్‌నగర్ రూరల్: అగ్నివీర్‌లో ఉద్యోగాలు సాధించి శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన వారికి శనివారం యువ సైనిక్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రికి చెందిన వరుణ్‌కుమార్ రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన చల్మారెడ్డి, జహీరాబాద్ జిల్లాకు చెందిన సాగర్, నిజామాబాద్ జిల్లాకు చెందిన వేదాన్ష్, కల్వకుర్తికి చెందిన శేషికుమార్ పట్టణంలోని యువసైనిక్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. అగ్నివీర్ పరీక్షలో ఉత్తీర్ణతను సాధించి ఉద్యోగాలను పొందారు. 2023 బ్యాచ్‌లో 7 నెలల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు పట్టణానికి వచ్చిన సందర్భంగా నేషనల్ అథ్లెట్‌కోచ్ గిరి ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ.. 2024 సంవత్సరం నోటిఫికేషన్ అగ్నివీర్ పరీక్షకు ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 20 నుంచి ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం 9493434907, 9848947484 నంబర్‌లను సంప్రదించాలని పేర్కొన్నారు.

భూ వివాదంలో పరస్పర దాడులు

ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన రామకృష్ణ

దోమ: భూ వివాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా కోస్గి మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన బుసకోటి రామకృష్ణకు మండలంలోని గుండాల శివారులో భూములున్నాయి. అదే గ్రామానికి చెందిన దాయాదులు పిట్ల కృష్ణయ్య, వెంకటరాములు, సాయిలు, శివకు అక్కడే భూములున్నాయి. వీరి నడుమ కొంతకాలంగా భూ తగాదాలు కొనసాగుతున్నాయి. సర్వే నంబర్ 73లో కొంత భాగం తమకు వస్తుందని దాయాదులు రామకృష్ణను కోరారు. ఇందుకు సర్వే సైతం చేయించినా ఆయన నిరాకరించాడు. దీంతో పరస్పరం గొడ్డలి, కర్రలతో దాడి చేసుకునేంత వరకు వెళ్లింది. ఈ ఘర్షణలో రామకృష్ణపై గొడ్డలితో దాడి చేయడంతో తీవ్ర గాయాలు కాగా, దాయాదులకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వ్యవసాయంలో మహిళలదే ప్రధాన పాత్ర



మహిళా నేతలను సన్మానిస్తున్న బీకేఎస్ నాయకులు

నారాయణపేట: వ్యవసాయంలో ముఖ్యపాత్ర మహిళలదేనని బీకేఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు లావణ్య పేర్కొన్నారు. ప్రతిగ్రామంలో మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ సభ్యత్వం చేయిస్తూ, జిల్లా, మండల కమిటీలో వారిని నియమించాలని అన్నారు. శనివారం ఆమె నారాయణపేటను రావడంతో బీకేఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు లేనిది వ్యవసాయం చేయలేమన్నారు. ఈప్రాంతంలో రైతులకు కష్టపడే తత్వం ఉందన్నారు. అధికదిగుబడి నిచ్చే వంగడాలు ఉత్పత్తి చేసి అధికలాభాలు చేకూర్చాలని కోరుతున్నామన్నారు. భారతీయ కిసాన్ చాలా పటిష్టంగా ఉందని అన్నారు. భూ సమస్యలు పరిష్కరించుకోవాలని, క్షణిక ఆవేశంలో గొడవలు పెట్టుకోరాదని, సమస్యలు పరిష్కరించడానికి మార్గాలు అన్వేషించాలన్నారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల చిన్నపొర్ల గ్రామంలో భూ వివాదంలో జరిగిన ఘటన చాలా బాధిస్తుందన్నారు. ఆ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్నిచ్చి ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో బీకేఎస్ నాయకులు బాలప్ప, అనంతరెడ్డి, లక్ష్మీనారాయణ, మల్లికార్జున్, వెంకటప్ప, నాగార్జున, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో చిరుత మృతి

- అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో శ్రీశైలం డ్యాం సమీపంలో లభ్యం
- ఇతర జంతువుల దాడిలో చనిపోయినట్టు అధికారుల నిర్ధారణ

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అటవీప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో శనివారం ఉదయం చిరుతపులి కళేబరం లభ్యమైంది. దోమలపెంట అటవీ రేంజ్ పరిధిలో శ్రీశైలం డ్యాం సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం రహదారి పక్కన 8 నెలల మగ చిరుత చనిపోయి ఉన్నట్టు అటవీ అధికారులు గుర్తించారు. చిరుత మెడ భాగంలో ఉన్న గాయాలను బట్టి ఇతర జంతువుల దాడి కారణంగా మృతి చెందినట్టు నిర్ధారించారు. చిరుత గోళ్లు, దంతాలకు ఎలాంటి నష్టం కలగలేదని, దాంతో ఇతర వన్యప్రాణుల దాడి వల్లే మరణించిందని తేల్చారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ అనిల్ ఆధ్వర్యంలో చిరుత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అడవిలోనే కళేబరాన్ని దహనం చేశారు. ఐఎఫ్ఎస్ అధికారి సుశాంత్, ఎఫ్ఆర్వో గురుప్రసాద్, ఎన్జీఓ ప్రతినిధి బాపురెడ్డి తదితరులు ఉన్నారు.



అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని దోమలపెంట వద్ద లభ్యమైన చిరుత కళేబరం

ఫిట్‌నెస్‌లేని స్కూల్ బస్సులు

- రెండింటిపై కేసున మోదు
- జడ్చర్లలో తనిఖీలు చేసిన ఇన్‌చార్జ్ డీటీఓ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈనెల 12 నుంచి జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేయడం ప్రారంభించారు. శనివారం జడ్చర్లలో ఇన్‌చార్జ్ డీటీఓ వాసుదేవ్‌రావు ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. ఫిట్‌నెస్, పర్మిట్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ ఇతర పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న రెండు బస్సులపై కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 12స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. డీటీఓ మాట్లాడుతూ తనిఖీలు రోజూ ఉంటాయన్నారు.



బస్సు వివరాలు పరిశీలిస్తున్న అధికారులు